దీక్ష చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## హామీలను అమలు చేయాలి

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్ష**

గూడూరు, అక్టోబర్ 23 : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 48 గంటల నిరాహార దీక్షను మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబడక తప్పదన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పారని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే బీఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీతో గెలుస్తుందని సర్వేలు చూస్తే తెలుస్తున్నదని, ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. దీక్షలో ఎండీ రహీం, భూక్యా సురేశ్, బోడ ఎల్లయ్య, నూకల అశోక్, ఎండీ హైమద్, అనిల్, దోమ వెంకన్న, నాగేంద్రబాబు, కుమార్, రాజ్‌పటేల్ పాల్గొనగా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం సంపత్‌రావు, నర్సింహ, ఏదునూరి వెంకన్న, చందర్, స్టాలిన్, కిషన్, రాములు, బెజ్జం రమేశ్, తండా శ్రీహరి, శ్రీనివాస్, వెంకన్న, రవి, వెంకట్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు.

## అర్హులకు పరిహారం అందించాలి

మహబూబాబాద్ రూరల్ : భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని లక్ష్మీపురం(బీ) రైతులు వల్లెపు వెంకన్న, చారి హరీశ్, గుంజె రాజు, చంద్రయ్య బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష్మీపురం(బీ) గ్రామంలో మున్నేరు వాగు పరీవాహక ప్రాంతంలోని పొలాలు భారీ వర్షాలతో దెబ్బతిన్నాయని, వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించలేదన్నారు. ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేయించి, తమకు అనుకూలంగా ఉన్నవారికి, పట్టాలు లేని వ్యక్తులకు డబ్బులు అందించారని అన్నారు. నిజంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పూర్తి విచారణ చేయిస్తే అసలు విషయం బయటకు వస్తుందని రైతులు కలెక్టర్‌ను కోరారు.

## తొర్రూరు మార్కెట్ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి

తొర్రూరు, అక్టోబర్ 23 : తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన అనుమాండ్ల తిరుపతిరెడ్డి నియామకమయ్యారు. పూర్తిస్థాయి కమిటీని ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# చట్టాలను గౌరవించాలి

- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్
- జిల్లావ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో ఓపెన్‌హౌస్
- చట్టాలు, ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 23 : చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ విధి విధానాలు, పని తీరుపై ఓపెన్ హౌస్ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 300 మంది ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో పాల్గొనగా, వారికి ఆర్మ్‌డ్‌ఫోర్స్ అధికారులకు ఆయుధాలు, పోలీస్ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరాల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ దేవేందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

**బయ్యారంలో..**

బయ్యారం : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీస్ విధులు, ఆయుధాల వినియోగం వంటి అంశాలపై గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి, జిన్నత్ పాల్గొన్నారు.

**ఆయుధాలపై అవగాహన**

నెల్లికుదురు : పోలీస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రమేశ్‌బాబు పోలీసు స్టేషన్‌లో ఉన్న ఆయుధాల వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ఏకే 47 గన్ పనిచేసే విధానంపై విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

**చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి**

నర్సింహులపేట, అక్టోబర్ 23 : విద్యార్థులు పోలీస్ విధులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సురేశ్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. విద్యార్థులకు ఆయుధాలు, పోలీసు చట్టాలు, సీసీ కెమెరాల వల్ల కలిగే లాభాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కురవిలో..**

కురవి, అక్టోబర్ 23 : విద్యార్థులు చట్టాలు, పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అందే సేవలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కురవి పోలీస్ స్టేషన్‌లో బుధవారం విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ చట్టాలు, ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సదయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**సమాజానికి ఆదర్శంగా నిలవాలి**

తొర్రూరు, అక్టోబర్ 23 : విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని తొర్రూరు సీఐ జగదీశ్ సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాంజీనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

**పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి**

మరిపెడ, అక్టోబర్ 23 : విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి మున్సిపల్ కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజా రక్షణకు తమ ప్రాణాలను పణంగాపెట్టి విధులు నిర్వహించేది పోలీసు వ్యవస్థ ఒక్కటేనన్నారు. అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మరిపెడ, చిన్నగూడూరు, కురవి ఎస్సైలు సతీశ్‌గౌడ్, సంతోష్, ఝాన్సీ, నగేశ్, పోలీస్ సిబ్బంది, నాయకులు తాజుద్దీన్, అప్జల్‌పాషా, శ్రీను, లింగన్న, పరశురాములు, రవి, మేఘనాథ్, వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

**కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్**

మహబూబాబాద్, అక్టోబర్ 23 : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వానలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేయించాలని, మలుపుల వద్ద ముళ్లపొదలు, చెట్ల కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ఆటోలు, బస్సుల వివరాలు సేకరించాలని, రూల్స్ ప్రకారం ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ..జిల్లాలో 20 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామన్నారు. ఆయా ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, లైట్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడంతో ప్రమాదాల సంఖ్య తగ్గిందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, డీఆర్‌డీవో జైపాల్‌రెడ్డి, ఆర్టీవో సాయికిరణ్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మురళీధర్, మున్సిపల్ డీఈ ఉపేందర్, నేషనల్ హైవే డీఈ అమీర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 23 : ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ టీ ప్రైడ్ స్కీం ద్వారా జిల్లాలోని షెడ్యూల్డ్ ట్రైబ్, షెడ్యూల్ క్యాస్ట్‌కు చెందిన 15 మందికి ఎస్సీ, ఎస్టీ సబ్సిడీ రుణాలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, పౌల్ట్రీ, రైస్ మిల్లు, చిల్లీ వ్యాపారం, వాణిజ్య వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలపై యువతకు అధికారులు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహారావు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా**

మహబూబాబాద్ రూరల్ : పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏ ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాగం లోకేశ్, వెలుగు శ్రావణ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవా రం పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే చదువుకునేదెలానని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు అనేక హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్, వెంకటేశ్, వికాశ్, సాయి, ప్రకాశ్, అశోక్, ప్రణయ్ పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్‌తో భవిష్యత్‌లో ప్రమాదం

గూడూరు, అక్టోబర్ 23: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముంజాల రాజేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక గౌడ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ విద్యార్థులు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని, కేంద్రం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం వల్ల అనేక మంది నష్టపోతారని అన్నారు. జీవో నంబర్ 29ను బహిర్గతం చేయాలని, గ్రూప్-1 పరీక్షలు రాసిన విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ల విష్ణు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి చాగంటి మంజుల, స్టీరింగ్ కమిటీ సభ్యులు జూలూరి రమేశ్, ఇతర బాధ్యులు హైమావతి, జ్యోతి, యాకయ్య, మల్లయ్య, ఉపేందర్, మల్లయ్య, కుమారస్వామి, యాకాంబ్రం, వీరస్వామి పాల్గొన్నారు.

## కరెంటు కోతలను నివారించండి

బయ్యారం, అక్టోబర్ 23 : ఏజెన్సీలో కరెంట్ కోతలను నివారించాలని న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ నాయకులు బుధవారం కంబాలపలి సబ్ స్టేషన్‌లో ఏఈ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఏజెన్సీలో వరి, మక్కజొన్న పంటలు చేతికందే దశలో ఉన్నాయని, మిరప పూతదశకు చేరిందన్నారు. ఈ పరిస్థితుల్లో తరచూ కరెంటు కోతల వల్ల పంటలు దెబ్బతింటున్నాయన్నారు. మరోవైపు కరెంటు సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల మోటర్లు కాలిపోతున్నాయని తెలిపారు. దీంతో రైతులు రెండు విధాలా నష్టపోతున్నారని అన్నారు. కరెంట్ కోతలు నివారించి, రైతులను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మేకపోతుల నాగేశ్వర్‌రావు, భిక్షయ్య, చింత కృష్ణ, చింత రాంబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు

నెల్లికుదురు : ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం సెకండ్ పార్ట్ పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు ఉచితంగా అందుతున్నాయన్నారు. పాఠశాల ప్రారంభ సమయంలో పాఠ్యపుస్తకాలు అందజేశామని, సెకండ్ పార్ట్ పాఠ్యపుస్తకాలను ఇప్పుడు అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఏ భాస్కర్ రావు, వీరస్వామి, డీ రవి, బీ కవిత, జే కవిత, ఈఆర్పీ పీ యాకయ్య, కంప్యూటర్ ఆపరేటర్ హెచ్ ఉపేందర్ పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి

బయ్యారం : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో అమలవుతున్న వివిధ కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణ, ఎన్సీడీ, టీబీ తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రతిరోజూ సబ్ సెంటర్ల నుంచి వ్యాధిగ్రస్తుల వివరాలను ఐహెచ్ఐపీ పోర్టల్ నమోదు చేయాలని ఆదేశించారు. విది నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమీల, పీవోఎంహెచ్ఎన్ సారంగం, వైద్యాధికారి సాగర్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తొర్రూరు, అక్టోబర్ 23 : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ ఎస్‌కే బషీర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అక్రంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో బ్రాహ్మణకొత్తపల్లి ఆకేరు వాగు నుంచి తొర్రూరు వైపు వస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

## నూతన కోర్టులు ఏర్పాటు చేయాలి

తొర్రూరు : అదనపు జూనియర్ సివిల్ జడ్జి, సబ్ జడ్జి కోర్టులను తొర్రూరులో ఏర్పాటు చేయాలని కోరుతూ తొర్రూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలంగాణ హైకోర్టులో పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ సురేపల్లి నందాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలువకొలను ప్రవీణ్ రాజు, జనరల్ సెక్రటరీ ఆర్‌కే ఘనపురం, సీనియర్ న్యాయవాదులు బండపల్లి వెంకన్న, యాకాంబరం, ఐలోని, శ్రీనివాస్, ప్రదీప్ పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకారం

కురవి, అక్టోబర్ 23 : కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కిసాన్ పరివార్ సీఈవో డాక్టర్ వివేక్, పల్లవి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధికి కిసాన్ పరివార్ సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ పరివార్ మండ ల కో ఆర్డినేటర్ గుగులోత్ శివవర్మ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్, సీరోల్ మండల కో ఆర్డినేటర్ విష్ణునాయక్, మరిపెడ కో ఆర్డినేటర్ ఎడెల్లి వెంకన్న, వెంకటేశ్వర్లు, డోర్నకల్ మండల కోఆర్డినేటర్ రామ్మూర్తి, గొడుగు శ్రీనివాస్, రంగన్నగౌడ్ పాల్గొన్నారు. ఇటీవల డోర్నకల్ మండల రిపోర్టర్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో కిసాన్ పరివార్ సీఈవో వివేక్ ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన వైద్యానికి సహకరిస్తానన్నారు. పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, గుంటి సురేశ్, బేతమల్ల సహదేవ్, వీరన్న, ప్రమోద్, రోశయ్య, ఉపేందర్ వివేక్ దంపతులను సత్కరించారు.

## నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కురవి, అక్టోబర్ 23 : కురవి మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ వద్ద గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని ధరణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నదని మహబూబాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ గుండె వైద్యనిపుణుడు అశోక్‌కుమార్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ దీప్తి తోపాటు పలువురు వైద్యులు, పాల్గొంటారని తెలిపారు.

## ఆధార్‌తోనే ఎరువులను విక్రయించాలి

కేసముద్రం, అక్టోబర్ 23 : రైతుల ఆధార్ నంబర్ ఆధారంగానే ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి వెంకన్న అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్ల వివరాలు, గోదాముల్లో నిల్వలతో తేడా ఉండొద్దన్నారు. ఎరువుల కోసం వెళ్తున్న రైతులు తప్పకుండా ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నిలిచిన యూనియన్ బ్యాంకు సేవలు

కేసముద్రం, అక్టోబర్ 23 : సాంకేతిక సమస్య కారణంగా మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో మూడు రోజులుగా సేవలు నిలిచిపోయాయి. దీంతో రోజువారీ లావాదేవీల కోసం బ్యాంకు వచ్చిన వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల పిడుగు పడి ఇంటర్‌నెట్ వ్యవస్థ దెబ్బతిన్నదని, హైదరాబాద్ నుంచి టెక్నికల్ సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరించినట్లు సిబ్బంది తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి బ్యాంకు సేవలు అందుతున్నట్లు తెలిపారు.

## నేషనల్ ప్రోగ్రామ్స్ సక్రమంగా నిర్వహించాలి

డోర్నకల్, అక్టోబర్ 23 : నేషనల్ ప్రోగ్రామ్స్‌ను సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమీల అన్నారు. బుధవారం డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సద్విజ, సూపర్‌వైజర్లు వెంకన్న, ప్రమీల, శ్రీహరి , ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

గార్ల, అక్టోబర్23 : దేశ ప్రజలకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం జిల్లా నాయకుడు హరినాయక్ అన్నారు. బుధవారం స్థానిక మంగపతిరావు భవనంలో జరిగిన గోపాలపురం గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈశ్వరలింగం, పెద్ద వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, గోవిందు నాగరాజు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

నెల్లికుదురు, అక్టోబర్ 23 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరుబాట పట్టాలని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్‌బాబు అన్నారు. బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా వందశాతం అమ లు చేయాలేదని ఆరోపించారు. పంట కాలం ముగుస్తున్నా ఇప్పటివరకు రైతు భరోసా వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇస్సంపల్లి సైదులు, వెంకన్న, జానీ, ఐలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వర్గీకరణకు వ్యతిరేకంగా పాదయాత్ర

గూడూరు, అక్టోబర్ 23 : ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం రమేశ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ భద్రాచలం వరకు చేపట్టనున్న పాదయాత్ర కరపత్రాలను బుధవారం ఆయన గూడూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల ఐక్యతను చాటేందుకు ఈనెల 25న భద్రాచలం వరకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూనె రాములు, దోమ ఉపేందర్, కృష్ణ, శాంతివర్ధన్, స్టాలిన్, కరుణాకర్, శేఖర్ పాల్గొన్నారు.

## సమయ పాలన పాటించాలి

నర్సింహులపేట : ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం నేర్పించాలని ఇన్‌చార్జి ఎంఈవో రామ్మోహన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని పెద్దనాగారం అమర్‌సింగ్ తండా, వస్రంతండా, గోల్‌తండా పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. తరగతి గదులు, పరిసరాలు శుభ్రంగా లేవని, స్కావెంజర్‌ను ఎందుకు నియమించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో కాంప్లెక్స్ హెచ్ఎం జానకి సుమన, సీఆర్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 23 : జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ వాల్‌పోస్టర్‌ను అదనపు కలెక్టర్ డేవిడ్ ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా, మండల, పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 9291653497 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేశ్, బ్రహ్మం, కృష్ణప్రసాద్, యాకయ్య పాల్గొన్నారు.

## మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్‌లో శిక్షణ

మహబూబాబాద్ రూరల్ : పదో తరగతి పాసైన గిరిజన విద్యార్థుల కోసం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్ ఇండస్ట్రియల్, బేసిక్ డిజైనర్‌లో సంవత్సరంపాటు గిరిజన బాలురు, బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ సైదానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన భవనంలో 25న ఎంపిక కార్యక్రమం ఉంటుందన్నారు.

## 26న ధర్మయుద్ధ మహాసభ

మరిపెడ : వరంగల్ హంటర్‌రోడ్డులో ఈ నెల 26న జరిగే ఉమ్మడి జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం సీతారాంపురం కాలనీలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ధర్మయుద్ధ మహాసభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమం